దివ్యాంగుల చదువులకు.. ఆర్థిక పరిస్థితులతోపాటు, శరీరం సహకరించకపోవడం పెద్ద అవరోధాలవుతున్నాయి. వీరు శారీరక లోపం వల్ల కలిగిన వ్యథను అధిగమించి, జీవనం సాగించేందుకు సాయపడే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం వివిధ స్కాలర్‌షిప్పులను ప్రత్యేకంగా అందిస్తోంది. దివ్యాంగులు నిరాటంకంగా చదువుకుని వృత్తి, ఉద్యోగ జీవితంలో స్థిరపడటానికి ఇవెంతగానో తోడ్పడతాయి. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ వీటికి అవసరమైన నిధులు సమకూరుస్తుంది. తొమ్మిదో తరగతి నుంచి పీహెచ్‌డీ వరకూ వివిధ కోర్సులు చదువుతోన్నవారు, విదేశీ విద్య ప్రయత్నాల్లో ఉన్నవారు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే దివ్యాంగులు నేషనల్ స్కాలర్‌షిప్పు పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోవచ్చు.

విద్యాభ్యాసానికి దివ్యమైన సాయం!

కేంద్రం ఆధ్వర్యంలో 6 రకాల ఉపకార వేతనాలను దివ్యాంగుల కోసం అందిస్తున్నారు. అవి.. ప్రీ మెట్రిక్, పోస్టు మెట్రిక్, టాప్ క్లాస్ ఎడ్యుకేషన్, నేషనల్ ఓవర్సీస్, నేషనల్ ఫెలోషిప్, ప్రీ కోచింగ్. 40 శాతం, అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్న ఎవరైనా ఈ ఉపకార వేతనాలకోసం దరఖాస్తు చేసుకోవచ్చు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఉపకార వేతనాలు పొందనివారు వీటికి అర్హులు. ఎంపికలో కుటుంబ వార్షిక ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. ప్రీ-మెట్రిక్, పోస్ట్ మెట్రిక్, టాప్ క్లాస్ ఎడ్యుకేషన్ స్కాలర్‌షిప్పులకు రాష్ట్రాల వారీ కేటాయింపులు ఉంటాయి.

ఆంధ్రప్రదేశ్‌లో ప్రీ-మెట్రిక్ 910, పోస్ట్ మెట్రిక్ 773, టాప్ క్లాస్ ఎడ్యుకేషన్ 14 స్లాట్స్ ఉన్నాయి. తెలంగాణలో ప్రీ-మెట్రిక్ 781, పోస్ట్ మెట్రిక్ 664, టాప్ క్లాస్ ఎడ్యుకేషన్ 12 స్లాట్స్ లభిస్తాయి. దివ్యాంగ విద్యార్థినులకు వీటిలో 50 శాతం కేటాయించారు. నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్పుల్లో 30 శాతం మహిళలకు దక్కుతాయి. కేటాయించిన రాష్ట్రాల్లో తగినంత మంది అభ్యర్థులు లేకపోతే ఇతర రాష్ట్రాల దివ్యాంగ విద్యార్థులకు అవకాశం కల్పిస్తారు.

ఏఐసీటీఈ సాక్షం

సాక్షమ్ పేరుతో ఏఐసీటీఈ ఏటా దివ్యాంగ విద్యార్థులకు స్కాలర్‌షిప్పులను అందిస్తోంది. దివ్యాంగులు ఉన్నత చదువులకు దూరం కాకుండా చేయడానికి, వారికి ఆర్థికంగా అండగా ఉండాలనే లక్ష్యంతో వీటిని ఏర్పాటు చేశారు. నిర్దేశిత అర్హతలు ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ స్కాలర్‌షిప్పులు దక్కుతాయి. ఇలా ఎంపికైన వారికి ఏడాదికి రూ.యాభై వేల చొప్పున చెల్లిస్తారు. వీటిని డిప్లొమా విద్యార్థులకు మూడేళ్లు, ఇంజినీరింగ్ వారికి నాలుగేళ్లపాటు అందజేస్తారు. ఒకవేళ లేటరల్ ఎంట్రీ విధానంలో డిప్లొమా లేదా ఇంజినీరింగ్‌లో చేరినట్లయితే డిప్లొమాలో రెండేళ్లు, ఇంజినీరింగ్‌లో మూడేళ్ల పాటు ప్రోత్సాహం దక్కుతుంది. ఈ స్కాలర్‌షిప్పులను పుస్తకాలు, ఫీజు, వసతి, కంప్యూటర్, ఇతర ఖర్చుల నిమిత్తం ఉపయోగించుకోవచ్చు. ఏటా అభ్యర్థుల బ్యాంకు ఖాతాలోకి నేరుగా సొమ్ము జమచేస్తారు. ఇందుకోసం బ్యాంకు అకౌంటు, ఆధార్ కార్డు తప్పనిసరి.

అర్హతలు: డిప్లొమా లేదా డిగ్రీ (ఇంజినీరింగ్) ప్రథమ సంవత్సరం కోర్సుల్లో చేరినవారై ఉండాలి లేదా లేటరల్ ఎంట్రీ విధానంలో డిప్లొమా లేదా ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం కోర్సులు చదువుతున్నవారై ఉండాలి.

తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.8 లక్షల కంటే తక్కువగా ఉండాలి. ఇందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని జతచేయాలి. వైకల్యం కనీసం 40 శాతం లేదా అంతకుమించి ఉండాలి. ఈ ప్రోత్సాహం ఆశించేవారు ఇతర ఏ స్కాలర్‌షిప్పులనూ పొందనివారై ఉండాలి.

పదో తరగతి తర్వాత డిప్లొమాలో చేరడానికి; ఇంటర్/ డిప్లొమా తర్వాత ఇంజినీరింగ్‌కు మధ్య ఖాళీ వ్యవధి రెండేళ్లకు మించరాదు. ఏఐసీటీఈ గుర్తింపు పొందిన సంస్థల్లో చదవడం తప్పనిసరి.



ప్రీ-మెట్రిక్ ..

ప్రతి నెలా డే స్కాలర్స్‌కు రూ.500, హాస్టల్‌లో ఉండేవారికి రూ.800 చొప్పున ఇస్తారు. వీటితోపాటు బుక్ గ్రాంట్ కింది ఏటా రూ.1000, డిజేబిలిటీ అలవెన్స్ నిమిత్తం రూ.2000 నుంచి రూ.4000 వరకు ప్రోత్సాహకంగా అందిస్తారు.

ఎంపిక: విద్యార్థి అకడమిక్ ప్రతిభ, వయసు ఆధారంగా ఎంపిక చేస్తారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలకు మించకూడదు.

ఎవరి కోసం: తొమ్మిది, పది తరగతుల విద్యార్థులకు

స్కాలర్‌షిప్పుల సంఖ్య: 25,000.

పోస్ట్ మెట్రిక్ ..

మొత్తం విద్యార్థులను నాలుగు గ్రూపులుగా విభజించారు.

* **గ్రూప్-1లో:** మెడిసిన్, ఇంజినీరింగ్/టెక్నాలజీ, ప్లానింగ్/ఆర్కిటెక్చర్, ఫ్యాషన్ టెక్నాలజీ, మేనేజ్‌మెంట్, బిజినెస్/ఫైనాన్స్ అడ్మినిస్ట్రేషన్ తదితరాల్లో డిగ్రీ, పీజీ విద్యార్థులకు.. డే స్కాలర్స్ అయితే రూ.750, హాస్టలర్స్‌కు రూ.1600 చొప్పున ప్రతి నెలా ఇస్తారు.

✪ **గ్రూప్-2లో:** డిగ్రీ/ డిప్లొమా, ఫార్మసీ, ఎల్ఎల్‌బీ, పారా మెడికల్ బ్రాంచీలు తదితరాల్లో చదువుతున్న డే స్కాలర్స్‌కు నెలకు రూ.700, హాస్టలర్స్‌కు రూ.1100 చెల్లిస్తారు.

✪ **గ్రూప్-3లో:** బీఏ/ బీఎస్సీ/ బీకాం విద్యార్థులకు డే స్కాలర్స్‌కు నెలకు రూ.650, హాస్టలర్స్‌కు రూ.950 చొప్పున అందిస్తారు.

✪ **గ్రూప్-4లో:** ఐటీఐ / ఒకేషనల్ / పాలిటెక్నిక్ కోర్సులు చదివే విద్యార్థులకు డే స్కాలర్స్‌కు నెలకు రూ.550, హాస్టలర్స్‌కు రూ.900 చొప్పున ఇస్తారు. వీటితోపాటు బుక్ అలవెన్స్ కింద సంవత్సరానికి రూ.1500, డిజేబిలిటీ అలవెన్స్ ఏడాదికి రూ.2000 నుంచి రూ.4000 వరకు అందిస్తారు.

ఎంపిక: విద్యార్థి అకడమిక్ ప్రతిభ, వయసు ఆధారంగా. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలకు మించకూడదు.

ఎవరి కోసం: ఇంటర్మీడియట్, డిప్లొమా, డిగ్రీ, పీజీ విద్యార్థులు

స్కాలర్‌షిప్పుల సంఖ్య: 17,000

టాప్ క్లాస్ ఎడ్యుకేషన్

కళాశాల ట్యూషన్ ఫీజు రూ.2 లక్షల వరకు రీఇంబర్స్‌మెంట్ ఉంటుంది. దైనందిన ఖర్చుల నిమిత్తం నెలకు డే స్కాలర్స్‌కు రూ.1500, హాస్టలర్స్‌కు రూ.3000 చొప్పున అందిస్తారు. స్పెషల్ అలవెన్స్ నెలకు రూ.2000, బుక్స్, స్టేషనరీ నిమిత్తం ఏడాదికి రూ.5000, రీఇంబర్స్‌మెంట్ ద్వారా కంప్యూటర్ కొనుక్కోవడానికి రూ.45 వేలను మొత్తం కోర్సులో ఒకేసారి గ్రాంటు రూపంలో ఇస్తారు. దివ్యాంగులకు సహాయపడే పరికరాలు కొనుగోలుకు రీఇంబర్స్‌మెంట్ రూపంలో రూ.30 వేలను మొత్తం కోర్సులో ఒకేసారి గ్రాంటు రూపంలో ఇస్తారు.

ఎంపిక: విద్యార్థి అకడమిక్ ప్రతిభ, వయసు ఆధారంగా ఉంటుంది. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.8 లక్షలకు మించకూడదు. ఆన్‌లైన్‌ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

ఎవరి కోసం: డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిజేబిలిటీస్ గుర్తింపు పొందిన 240 కళాశాలల్లో డిగ్రీ/డిప్లొమా, డిగ్రీ/పీజీ చదువుతున్న విద్యార్థులు

స్కాలర్‌షిప్పుల సంఖ్య: 300

నేషనల్ ఫెలోషిప్

మొదటి రెండేళ్లకు జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్ (జేఆర్ఎఫ్) ద్వారా ఎంపికైన అభ్యర్థికి స్కాలర్‌షిప్ ఉంటుంది. తర్వాత పరిశోధన పురోగతి సంతృప్తికరంగా ఉంటే సీనియర్ రిసెర్చ్ ఫెలోషిప్ (ఎస్ఆర్ఎఫ్) రూపంలో మరో మూడేళ్లు ఉపకారవేతనం అందిస్తారు. జేఆర్ఎఫ్‌కు నెలకు రూ.31,000 ఎస్ఆర్ఎఫ్‌కు నెలకు రూ.35,000 ఉపకార వేతనం అందిస్తారు. హాస్టల్‌లో వసతి పొందనివారికి హెచ్ఆర్ఏ ఇస్తారు. ఏటా కాంటింజెన్సీ చెల్లిస్తారు. ఒకవేళ సహాయకుడు అవసరమైతే అందుకుగాను ప్రతి నెలా రూ.2000 వారికి ఇస్తారు.

ఎంపిక: అర్హులను యూజీసీ మార్గదర్శకాల ప్రకారం ఎంపిక చేస్తారు.

ఎవరి కోసం: యూనివర్సిటీల్లో ఎంఫిల్/ పీహెచ్‌డీ చేస్తున్నవారు. తల్లిదండ్రుల ఆదాయంతో సంబంధం లేదు. యూజీసీ/సీఎస్ఐఆర్ - నెట్ జేఆర్ఎఫ్‌కు ప్రాధాన్యం.

ఏడాదికి స్కాలర్‌షిప్‌ల సంఖ్య: 200+

నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్

ఇంజినీరింగ్ మేనేజ్‌మెంట్, ప్యూర్ సైన్సెస్ అండ్ అప్లైడ్ సైన్సెస్, అగ్రికల్చర్ సైన్స్ అండ్ మెడిసిన్, కామర్స్, అకౌంటింగ్ అండ్ ఫైనాన్స్, హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్, లా అండ్ ఫైన్ ఆర్ట్స్ విభాగాల్లో విదేశీ యూనివర్సిటీల్లో మాస్టర్స్ డిగ్రీ/ పీహెచ్‌డీ చేస్తున్న దివ్యాంగులకు ఉపకారవేతనం అందిస్తారు. బ్యాచిలర్స్/ మాస్టర్స్ డిగ్రీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం. వయసు 35 కంటే తక్కువ ఉండాలి. యు.కె. మినహా ఇతర దేశాల యూనివర్సిటీల్లో చదివే విద్యార్థులకు ఏడాదికి 15400 యూఎస్ డాలర్లు, కంటింజెన్సీ అలవెన్స్ రూపంలో ఏడాదికి 1500 యూఎస్ డాలర్లు అందిస్తారు. యు.కె. యూనివర్సిటీల్లో చదివేవారికి ఏడాదికి 9900 జీబీపీ, కంటింజెన్సీ అలవెన్స్ రూపంలో ఏడాదికి 1100 జీబీపీ వస్తుంది. వీటితోపాటు వీసా ఫీజు, విమాన చార్జీలు, మెడికల్ ఇన్సూరెన్స్.. మొదలైనవాటికి అవసరమయ్యే మొత్తాన్ని చెల్లిస్తారు. పీహెచ్‌డీ విద్యార్థులకు నాలుగేళ్లు, మాస్టర్స్ డిగ్రీ చదివేవారికి మూడేళ్లు స్కాలర్‌షిప్ వస్తుంది. వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు నింపి సంబంధిత సర్టిఫికెట్లను జతచేసి పోస్టు చేయాలి. కుటుంబ వార్షిక ఆదాయం ఏడాదికి రూ.ఆరు లక్షలు మించకూడదు.

ఎంపిక: మెరిట్, షార్ట్‌లిస్ట్ ఆధారంగా.

ఎవరి కోసం: విదేశీ యూనివర్సిటీల్లో మాస్టర్స్/ పీహెచ్‌డీ చేస్తున్న అభ్యర్థులు. వయసు 35 లోపు ఉండాలి.

ఏడాదికి స్కాలర్‌షిప్పుల సంఖ్య: 20+

ఉచిత శిక్షణ, ఉపకారవేతనం

యూపీఎస్‌సీ, ఎస్ఎస్‌సీ, ఐబీపీఎస్, ఆర్ఆర్‌బీ, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్లు నిర్వహించే పోటీ పరీక్షలు, ఐఐటీ-జేఈఈ, నీట్, క్లాట్, క్యాట్... మొదలైన ప్రవేశ పరీక్షలకు సన్నద్ధమవుతున్నవారు పేరున్న సంస్థలో ఉచితంగా శిక్షణ పొందే అవకాశం ఉంది. దీని ద్వారా కోచింగ్ ఇన్‌స్టిట్యూట్ ఫీజు చెల్లించడంతో పాటు లోకల్ విద్యార్థికి స్కాలర్‌షిప్‌గా నెలకు రూ.2500, నాన్ లోకల్ విద్యార్థికి రూ.5000 ఇస్తారు. స్పెషల్ అలవెన్స్ కింద మరో రూ.2000 ఉపకారవేతనం అందిస్తారు. ప్రాథమికంగా ఏడాది స్కాలర్‌షిప్ చెల్లిస్తారు. ఆ ఏడాది ఏ ఉద్యోగం సాధించలేక పోతే తర్వాత సంవత్సరానికి విద్యార్థి రెన్యువల్ చేసుకోవచ్చు. అకడమిక్ మెరిట్ ఆధారంగా ఎంపిక ఉంటుంది. కుటుంబ వార్షిక ఆదాయం ఏడాదికి రూ.ఆరు లక్షలు మించకూడదు.

ఎంపిక: మెరిట్ ఆధారంగా

ఎవరి కోసం: పోటీపరీక్షలు, ప్రవేశ పరీక్షలకు శిక్షణ తీసుకునే విద్యార్థులు

ఏడాదికి స్కాలర్‌షిప్పుల సంఖ్య: 20,000

దరఖాస్తుకు చివరి తేదీ: ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్పులకు నవంబరు 30. మిగిలిన అన్నింటికీ డిసెంబరు 31

వెబ్‌సైట్: https://scholarships.gov.in/

నోటిఫికేషన్స్

ప్రభుత్వ ఉద్యోగాలు

బీహెచ్ఈఎల్‌లో ప్రాజెక్ట్ ఇంజినీర్‌లు

బెంగళూరులోని భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్).. తాత్కాలిక ప్రాతిపదికన 11 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

★ ప్రాజెక్ట్ ఇంజినీర్ - 04 ★ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్స్ - 07

అర్హత: డిప్లొమా, బీఈ, బీటెక్ ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్/ కంప్యూటర్ సైన్స్‌తో పాటు సంబంధిత విభాగంలో పని అనుభవం.

వయసు: 32 ఏళ్లు మించకూడదు.

ప్రాజెక్ట్ ఇంజినీర్‌కు నెలకు రూ.82,620, ప్రాజెక్ట్ సూపర్‌వైజర్‌కు నెలకు రూ.46,130 చెల్లిస్తారు.

ఎంపిక: ఇంటర్వ్యూ ఆధారంగా

దరఖాస్తు ఫీజు: రూ.200

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 07-11-2023

వెబ్‌సైట్: https://www.bhel.com/

ప్రవేశాలు

క్రాఫ్ట్స్ అండ్ డిజైన్ సంస్థలో..

రాజస్థాన్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రాఫ్ట్స్ అండ్ డిజైన్ (ఐఐసీడీ) సంస్థ కింది కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతుంది.

1. నాలుగేళ్ల బ్యాచిలర్ ప్రోగ్రామ్ (బీ.డీఈఎస్)

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి 10+2/ ఇంటర్మీడియట్

2. రెండేళ్ల మాస్టర్ ప్రోగ్రామ్ (ఎం.డీఈఎస్)

అర్హత: డిజైన్, ఆర్కిటెక్చర్‌లో ఏదైనా డిగ్రీ

3. మూడేళ్ల మాస్టర్ ప్రోగ్రామ్ (ఎం.వీఓసీ)

అర్హత: ఏదైనా డిగ్రీ

విభాగాలు: హార్డ్ మెటీరియల్ డిజైన్, సాఫ్ట్ మెటీరియల్ డిజైన్, ఫైర్డ్ మెటీరియల్ డిజైన్, ఫ్యాషన్ క్లాతింగ్ డిజైన్, జ్యువెలరీ డిజైన్, క్రాఫ్ట్స్ కమ్యూనికేషన్

ఎంపిక: ప్రవేశ పరీక్ష ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 28-12-2023

అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్: 30-12-2023

పరీక్ష తేదీ: 07-01-2024

ఫలితాలు: 12-01-2024

తరగతుల ప్రారంభం: 2024 జులై నుంచి

వెబ్‌సైట్: www.iicd.ac.in/

ఐఐఎంఎల్‌లో పీహెచ్‌డీ

లఖ్‌నవూలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డాక్టోరల్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ (పీహెచ్‌డీ) ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

విభాగాలు: అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్, కమ్యూనికేషన్, డెసిషన్ సైన్సెస్, ఎకనామిక్స్, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ సిస్టమ్స్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్

అర్హత: సంబంధిత విభాగాల్లో బ్యాచిలర్, మాస్టర్ డిగ్రీ, సీఏ, ఐసీడబ్ల్యూఏ

ఎంపిక: 2022, జనవరి 1 తర్వాత నిర్వహించిన క్యాట్, గేట్, జీఆర్ఈ, జీమ్యాట్ పరీక్షల మార్కుల ఆధారంగా

వయసు: 55 ఏళ్లకు మించకూడదు

దరఖాస్తు ఫీజు: రూ.1000 **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 31-01-2024 **వెబ్‌సైట్:** https://www.iiml.ac.in/

చదువు
మా చిరునామా: చదువు, ఈనాడు కార్యాలయం, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రామోజీ ఫిల్మ్‌సిటీ – 501 512 edc@eenadu.in

మూడు పీజీలు చేస్తే...

నా స్నేహితురాలు ఎంఏ తెలుగు, సంస్కృతం, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్లలో పీజీ చేసింది. ఇలా రెండు, మూడు పీజీలు చేస్తే మంచిదా? పీహెచ్‌డీ చేస్తే మేలా?

- శార్వాణి

■ మీ స్నేహితురాలు మూడు పీజీలు ఏ ఉద్దేశంతో చేసిందో తననే అడిగి తెలుసుకోండి. సాధారణంగా చాలామంది విద్యార్థులు అభిరుచి కోసమో, మెరుగైన ఉపాధి అవకాశాల కోసమో, యూనివర్సిటీ / ప్రైవేటు హాస్టల్లో ఉంటూ పోటీ పరీక్షలు రాయడం కోసమో, ఉద్యోగప్రయత్నాల్లో విఫలమై సొంతూరికి వెళ్లలేకో, స్నేహితుల ప్రోద్బలంతోనో ఒక పీజీ తరువాత మరో పీజీ చదువుతూ ఉంటారు. మీ స్నేహితురాలు ఎంఏ తెలుగు, ఎంఏ సంస్కృతం చేసింది కాబట్టి ఏదైనా జూనియర్/డిగ్రీ కాలేజీలో రెండు భాషలు బోధిస్తూ మెరుగైన వేతనం పొందే అవకాశం ఉంది. ఈ రెండు సబ్జెక్టుల్లో ఉద్యోగావకాశాలు లేకపోతే పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ సబ్జెక్టును కూడా బోధించే అవకాశం ఉంది. ఒకవేళ పీజీ తరువాత పీహెచ్‌డీ చేయాలనుకొంటే, ఈ మూడు సబ్జెక్టుల్లో తనకు నచ్చినదానిలో చేయొచ్చు. కానీ రెండేళ్లలో పూర్తిచేయాల్సిన పీజీని ఆరు సంవత్సరాలు చదవడం వల్ల ఉద్యోగం పొందడం ఆలస్యం కావొచ్చు. బోధన రంగంలో ఉద్యోగ ఇంటర్వ్యూలకు వెళ్ళినప్పుడు 'మూడు పీజీలు ఎందుకు చేశారు?' అని అడిగితే సరైన సమాధానం చెప్పడం కొంత కష్టం అవుతుంది.

డిగ్రీ తరువాత పీజీ చేసినట్లు పీహెచ్‌డీ కోర్సు అందరూ చేయగలిగేది కాదు. పరిశోధనపై చాలా ఇష్టం, సంబంధిత మెలకువలు, బోధన పట్ల ఆసక్తి, కనీసం నాలుగు సంవత్సరాలపాటు మరే ఆలోచనా లేకుండా దీన్నే కొనసాగించగల ఓపిక, అంతర్జాతీయ ప్రమాణాలతో థీసిస్/ పరిశోధన పత్రాలను రాయగలిగే నైపుణ్యాలుంటేనే మంచి భవిష్యత్తు ఉంటుంది. చాలా సందర్భాల్లో పీహెచ్‌డీ చేసినవారు మెరుగైన ఉద్యోగం పొందలేక 15,000 నుంచి 25,000 రూపాయిల నెల వేతనంతో జూనియర్/డిగ్రీ కళాశాలల్లో అసంతృప్తితో పనిచేస్తున్నారు. కొద్దిమంది మాత్రమే యూనివర్సిటీల్లో/ ప్రయోగశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్/ సైంటిస్ట్‌గా దేశ విదేశాల్లో మెరుగైన ఉద్యోగాలు చేస్తున్నారు. బోధన రంగంపై ఆసక్తి ఉంటే పీజీ తరువాత నెట్/స్లెట్‌లో ఉత్తీర్ణత సాధించి డిగ్రీ కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా కూడా స్థిరపడొచ్చు. చివరిగా మూడు పీజీలు, పీహెచ్‌డీల్లో ఏది ప్రయోజనకరం అనేది ఆయా విద్యార్థుల ఆసక్తి, ఆశయాలను బట్టి ఉంటుంది.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

మేనేజ్‌మెంట్ కోర్సుల్లోకి.. మ్యాట్

దేశవ్యాప్తంగా ఉన్న బిజినెస్ స్కూళ్లలో మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశానికి ఆల్ ఇండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఏఐఎంఏ) నిర్వహించే మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (మ్యాట్) ప్రకటన వెలువడింది. డిగ్రీ పూర్తి చేసుకున్నవారితోపాటు చివరి ఏడాది కోర్సులు చదువుతున్నవాళ్లూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ స్కోరుతో సుమారు 600 సంస్థల్లో ఎంబీఏ/ పీజీడీబీఏ కోర్సుల్లో చేరవచ్చు. తెలుగు రాష్ట్రాల్లోనూ పలు సంస్థలు అవకాశం కల్పిస్తున్నాయి. మ్యాట్- డిసెంబరు 23 ప్రకటన వివరాలు...

ఈ పరీక్షను ఏటా నాలుగు సార్లు నిర్వహిస్తున్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో కోరుకున్న విధానంలో పరీక్ష రాసుకోవచ్చు. ఆసక్తి ఉంటే రెండు విధాలుగానూ రాసుకునే సౌలభ్యం ఉంది. రిమోట్ ప్రోక్టర్డ్ ఇంటర్నెట్ బేస్డ్ టెస్టు (ఐబీటీ), పేపర్ బేస్డ్ టెస్టు (పీబీటీ), కంప్యూటర్ బేస్డ్ టెస్టు (సీబీటీ), డబుల్ రిమోట్ ప్రోక్టర్డ్ ఇంటర్నెట్ బేస్డ్ టెస్టు (ఐబీటీ+ఐబీటీ), పేపర్ బేస్డ్ టెస్టు అండ్ రిమోట్ ప్రోక్టర్డ్ ఇంటర్నెట్ బేస్డ్ టెస్టు (పీబీటీ+ఐబీటీ), పేపర్ బేస్డ్ టెస్టు అండ్ కంప్యూటర్ బేస్డ్ టెస్టు (పీబీటీ+సీబీటీ), డబుల్ కంప్యూటర్ బేస్డ్ టెస్టు (సీబీటీ+సీబీటీ) వీటిలో నచ్చిన విధానాన్ని ఎంచుకోవచ్చు. పరీక్షలో సాధించిన స్కోరు ఏడాది వరకు చెల్లుతుంది. దేశవ్యాప్తంగా 50కు పైగా కేంద్రాల్లో పేపర్ బేస్డ్ పరీక్ష నిర్వహిస్తున్నారు.

పరీక్ష ఇలా..

లాంగ్వేజ్ కాంప్రహెన్షన్, మ్యాథమెటికల్ స్కిల్స్, డేటా ఎనాలిసిస్ అండ్ సఫిషియన్సీ, ఇంటెలిజెన్స్ అండ్ క్రిటికల్ రీజనింగ్, ఇండియన్ అండ్ గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్ అంశాల్లో ఒక్కో విభాగం నుంచి 40 చొప్పున 200 ప్రశ్నలు వస్తాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు. పరీక్ష వ్యవధి రెండున్నర గంటలు. ఇందులో లాంగ్వేజ్ కాంప్రహెన్షన్‌కు 30, ఇంటెలిజెన్స్ అండ్ క్రిటికల్ రీజనింగ్‌కు 30, మ్యాథ్స్ స్కిల్స్‌కు 40, డేటా ఎనాలిసిస్ అండ్ సఫిషియన్సీకి 35, ఇండియన్ అండ్ గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్‌కు 15 నిమిషాల వ్యవధి కేటాయించారు. మాదిరి ప్రశ్నలు, మాక్ టెస్టు వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.

తెలుగు రాష్ట్రాల్లో..

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్ ప్రైజ్ (ఐపీఈ), ఆస్కీ, గీతం, విజ్ఞాన జ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, ధ్రువ, అరోరా, ఐఐఆర్ఎం, విశ్వవిశ్వానీ, ఐటీఎం, ఐసీబీఎం... సంస్థలు మ్యాట్ స్కోర్‌తో ప్రవేశం కల్పిస్తున్నాయి.

ఇంటి నుంచే...

రిమోట్ ప్రోక్టర్డ్ ఇంటర్నెట్ బేస్డ్ టెస్టు (ఐబీటీ) విధానంలో ఇంటి నుంచే పరీక్ష రాసుకోవచ్చు. కంప్యూటర్, ఇంటర్నెట్ కనెక్షన్, వెబ్ క్యామ్ ఉంటే సరిపోతుంది. ప్రతి రోజూ రెండు స్లాటుల్లో ఉదయం, మధ్యాహ్నం వీటిని నిర్వహిస్తారు. నచ్చిన తేదీ, సమయం ఎంచుకునే వెసులుబాటు అభ్యర్థులకు ఉంటుంది. రాయాలనుకున్న తేదీకి కనీసం 4 రోజుల ముందు దరఖాస్తు చేసుకుంటే సరిపోతుంది. తేదీలు, స్లాట్ల వివరాలు వెబ్‌సైట్‌లో ఉన్నాయి.

AIMA ALL INDIA MANAGEMENT ASSOCIATION

అర్హత: ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత. చివరి ఏడాది కోర్సులు చదువుతున్నవారూ దరఖాస్తు చేసుకోవచ్చు.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా.

పరీక్ష ఫీజు: ఏదైనా విధానంలో ఒకసారి మాత్రమే పరీక్ష రాయడానికి రూ.2100. రెండుసార్లు రాయడానికి రూ.3300.

పీబీటీ పరీక్ష రిజిస్ట్రేషన్ చివరి తేదీ: డిసెంబరు 5

పేపర్ ఆధారిత రాతపరీక్ష తేదీ: డిసెంబరు 9

తెలుగు రాష్ట్రాల్లో పేపర్ బేస్డ్ పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం

సీబీటీ దరఖాస్తుకు చివరి తేదీ: మొదటి పరీక్షకు నవంబరు 28, రెండో పరీక్షకు డిసెంబరు 11.

సీబీటీ పరీక్ష తేదీలు: డిసెంబరు 3. డిసెంబరు 16.

వెబ్‌సైట్: https://mat.aima.in/

తాజా ఇంటర్న్‌షిప్‌లు

వర్క్ ఫ్రమ్ హోమ్

సేల్స్

సంస్థ: చక్రవర్తి ఓవర్సీస్
స్టైపెండ్: నెలకు రూ.6,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 26
అర్హతలు: లీడ్ జనరేషన్, సేల్స్ పిచ్ నైపుణ్యాలు
☛ internshala.com/i/ca3767

బిజినెస్ డెవలప్‌మెంట్

సంస్థ: క్లబర్
స్టైపెండ్: నెలకు రూ.5,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 26
అర్హతలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, లీడ్ జనరేషన్, సేల్స్ పిచ్ నైపుణ్యాలు
☛ internshala.com/i/0f684c

రిక్రూట్‌మెంట్

సంస్థ: కార్యార్థ్ కన్సల్టెంట్స్
స్టైపెండ్: నెలకు రూ.5,000-8,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 26
అర్హతలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఎంప్లాయ్‌మెంట్ ఎంగేజ్‌మెంట్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఆఫీస్
☛ internshala.com/i/e97b03

స్టాక్ మార్కెట్ మేనేజ్‌మెంట్

సంస్థ: గ్రోత్‌క్లూస్
స్టైపెండ్: నెలకు రూ.1,000-4,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 25
అర్హతలు: డిజిటల్ మార్కెటింగ్, సేల్స్ నైపుణ్యాలు
☛ internshala.com/i/280b46

హైదరాబాద్‌లో

ఆంత్రప్రెన్యూర్‌షిప్

సంస్థ: టీడమ్ వెంచర్స్
స్టైపెండ్: నెలకు రూ.10,000-12,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 27